క్లుప్తంగా

కూర్మ నారాయణుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న కూర్మనారాయణ స్వామి

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని కొండలో వెలసిన కూర్మనారాయణ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగ పూజ, పుష్పాలంకరణ, నైవేద్య సమర్పణ చేసి మంగళహారతులు ఇచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థినికి కిట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

మద్దికెర : విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ల కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సవిత తెలిపారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి ఉత్తమ భవిష్యత్‌కు సహకారం అందించాలన్నారు.

పాఠ్య పుస్తకాల అందజేత



ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

ఆస్పరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం ఎంఈఓ తిరుమలరావు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మొత్తం 53 పాఠశాలలకు 70 వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా ప్రస్తుతం 56 వేలు పాఠ్య పుస్తకాలు వచ్చాయని తెలిపారు. మిగిలిన పుస్తకాలు వచ్చిన వెంటనే పాఠశాలలకు పంపిణీ చేస్తామని చెప్పారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



జొన్నగిరిలో ఉద్యోగులను సన్మానిస్తున్న ఏపీజీబీ సిబ్బంది

తుగ్గలి : మండలంలోని జొన్నగిరి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ గీతాంజలి నన్నూరుకు, ఫీల్డ్ ఆఫీసర్ రోశయ్య ఒంగోలు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో శనివారం సాయంత్రం బ్యాంకులో వారికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మేనేజర్ లోకేష్, సిబ్బంది, ఖాతాదారులు బదిలీ ఉద్యోగులను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఖాతాదారులకు చేసిన సేవలను మేనేజర్ కొనియాడారు.

21న ప్రవేశ పరీక్ష

కృష్ణగిరి: స్థానిక మోడల్‌స్కూల్‌లో 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 21న పాఠశాలలో ఉదయం 9 గంటలకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19న మద్దికెరలో కేంద్ర కరువు బృందం పర్యటన

మద్దికెర: ఈనెల 19న మద్దికెర మండలంలో కేంద్ర కరువు బృందం పర్యటించనుందని ఏఓ రవి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరానికి సంబంధించి మండలాన్ని రబీ కరువు మండలంగా ప్రకటించినట్లు చెప్పారు. బృందంలోని అధికారులు మద్దికెర మండలంలో పర్యటించి రైతులతో సమావేశమై వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. కావున రైతులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై ఇక్కడి కరువు విషయమై కరువు బృందానికి వివరించాలని కోరారు.

ప్రశాంతంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలి

● పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

హొళగుంద: ఇతర మతాల మనోభావాలను గౌరవిస్తూ ఐక్యమత్యంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యనాయుడుతో కలిసి హిందు, ముస్లిం మతపెద్దలు, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకుని మత సామరస్యాన్ని పెంపొందించాలన్నారు. కొందరు చేసే పనుల వల్ల అందరూ ఇబ్బంది పడాల్సి వస్తుందని.. పండుగ అనేది ఆనందంగా జరుపుకోవాలే తప్పా ఆకతాయి చేష్టలతో అల్లర్లు సృష్టించి కేసులు, కోర్టుల చుట్టూ తిరిగేందుకు కాదన్నారు. అలాంటి వారిపై నిఘా ఉంటుందని.. రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ చట్టాలను గౌరవించాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి బంగారు భవిషత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గ్రామంలో ప్రశాంత వాతావరణానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, ఆర్‌ఐ దినోజ్ పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

వెల్దుర్తి(కృష్ణగిరి): బక్రీదు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కర్నూలు డీటీసీ సీఐ రమేష్ ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. హాజరైన హిందూ, ముస్లిం, బీజేపీ నాయకులతో ఆయన మాట్లాడుతూ సోమవారం బక్రీద్ పండుగను సోదరభావంతో నిర్వహించుకోవాలన్నారు. ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో చేసుకోవాలన్నారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎస్‌ఐ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాట్లాడుతున్న సీఐ రమేష్

గోవధ చేస్తే కఠిన చర్యలు

హాలహర్వి: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నరేంద్ర సూచించారు. శనివారం మండలంలోని విరుపాపురం, బిలేహాల్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. పండుగ రోజున గోవధ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. గొడవలు, ఘర్షణలకు పాల్పడకూడదని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



విరుపాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్ర

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: మహిళలు కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారిణి హేమలత సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆదోని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కాన్సర్ సోకే కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. కాన్సర్ వ్యాప్తి తీరును వైద్యసిబ్బంది మహిళలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు గీత, విజయభారతి, సంధ్యారాణి, సోమశేఖర్‌స్వామి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. నాగలదిన్నె గ్రామంలోని మిట్టసోమపురం క్రాస్ రోడ్డు వద్ద సోమలగూడూరు గ్రామానికి చెందిన వడ్డె వెంకటేష్, జంగం వీరయ్యలు ప్లాస్టిక్ సంచిలో కర్ణాటక మద్యాన్ని తలిరలిస్తుడంగా పట్టుకున్నామన్నారు. కర్ణాటక మద్యం 768 జాన్స్ ఒరిజినల్ చాయిస్ విక్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే నిందితులకి కర్ణాటక మద్యాన్ని విక్రయించి చాకలి గోవిందుపై కూడా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

టీబీ డ్యాంలో 6 టీఎంసీల నీరు



హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో శనివారం ఉదయం నాటికి 6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కొద్ది రోజులుగా డ్యాంలో నీటి మట్టం డెడ్‌స్టోరేజ్‌కు పడిపోవడంతో కేవలం జిందాల్‌కు మాత్రమే 10 క్యూసెక్కులను వదులుతున్న టీబీ బోర్డు అధికారులు ఇన్‌ఫ్లో పెరగడంతో శనివారం మరో రెండు కాలువలకు నీటిని విడుదల చేశారు. లెఫ్ట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్‌కు 233, రాయబసవన కాలువకు 58 క్యూసెక్కులు ప్రకారంగా మొత్తం 301 క్యూసెక్కులను కాలువలకు వదులుతున్నారు. 1,676 క్యూసెక్కులు (ఇన్‌ఫ్లో) డ్యాంకు వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతం నీటి మట్టం 1633 అడుగులకు గాను 1582.89 అడుగులకు చేరాయి.

అనుమతి లేని విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు

మద్దికెర : ప్రభుత్వం అనుమతించిన విత్తనాలు, మందులను మాత్రమే విక్రయించాలని, లేకపోతే చర్యలు తప్పవని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాదారులు లూజు విత్తనాలు విక్రయించరాదని, మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలకు సంబంధించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ఏఓ రవి, ఏఈఓ భోజరాజు, సహాయకులు జాకీర్, ఆనంద్, రాణి పాల్గొన్నారు.



మద్దికెరలో కోరమాండల్ ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



ఆలూరులోని ఏపీ మోడల్ స్కూల్

ఆలూరు రూరల్: ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాఘవరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలు స్థానిక మోడల్ స్కూల్‌లో లభిస్తాయన్నారు. విద్యార్థి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, తల్లిదండ్రుల ఆధార్, తల్లి బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను దరఖాస్తు ఫారంతో పాటు జతచేయాలన్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మోడల్ స్కూల్‌లో రాత పరీక్ష నిర్వహిస్తామని..మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. 7వ తరగతిలో 12 సీట్లు, 8వ తరగతిలో 12 సీట్లు, 9వ తరగతిలో 23 సీట్లు ఖాళీ ఉన్నాయని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు.

18న ఫక్కుమియ్యావలి స్వామి ఉరుసు

పత్తికొండ రూరల్ : పట్టణంలోని చక్రాళ్ల రోడ్డులో ఊరిచెరువు సమీపంలో కొలువైన హజరత్ ఫక్కు మియ్యా వలి సాహెబ్ ఉరుసును ఈనెల 18వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహిమాన్వితుడుగా పేరొందిన ఫక్కుమియ్యావలి స్వామిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా వివిధ గ్రామాల నుంచి భక్తాదులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ప్రతి గురువారం దర్గా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు మూడు రోజుల నిర్వహిస్తారు. భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా వివిధ రకాల అంగళ్లు వెలుస్తాయి. దీంతో తిరనాల వాతావరణం నెలకొంటుంది. ఇప్పటికే దర్గాను అందంగా అలంకరించి, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఉరుసు రోజున సాయంత్రం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. 17న గంధంతో ఉరుసు ప్రారంభమై 19న జియారత్‌తో వేడుకలు ముగుస్తాయని ముజావర్లు పి.మక్తుమ్, హుసేన్‌సా, అల్లాబకాష్ తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోనున్న ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జయరాం డిమాండ్‌చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు దీటుగా ప్రైవేట్ పాఠశాలల్లో కూడా అన్ని రకాల వసతులు కల్పించాలని కోరుతూ స్థానిక ఎమ్మార్సీలో శనివారం ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శివన్నతో కలిసి ఆయన విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేయడానికి వెళ్లగా.. అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ అటెండర్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో చాలా ప్రైవేట్ పాఠశాలలు రేకుల షెడ్లలో నడుపుతున్నారని, వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వసతులు లేకపోయినా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే అర్హులైన టీటీసీ, బీఈడీ చేసిన వారితో బోధన చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దుకు పోర్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యుడు నరేంద్రనాథ్‌రెడ్డి

నందవరం : మండల పరిధిలోని జొహరాపురం గ్రామానికి చెందిన రైతు కురవ రంగప్పకు చెందిన ఎద్దు విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన మేరకు వివరాలు .. గ్రామానికి చెందిన రంగప్ప అనే రైతు కాడెద్దులతో గంగవరం గ్రామానికి చెందిన కమతం రాజశేఖర్ రెడ్డి పొలంలో గుంటక పాయడానికి బాడుగకు వెళ్లాడు. పత్తిపొలంలో గుంటక పొస్తుండగా పొలంలోని కరెంట్ స్తంభానికి ఉన్న జీ(సపోట్) వైర్ ఎద్దుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే కుప్పకూలి మృత్యువాత పడింది. స్తంభానికి ఉన్న జీ వైర్‌కు కరెంట్ పాస్ అవడంతో ఎద్దు చనిపోయిందని బాధితుడు వాపోయాడు. రూ.60 వేలు నష్టం వాటిలిందని, ఆదుకోవాలని కోరాడు. అనంతరం పశు వైద్యుడు డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి ఎద్దుకు పోర్టుమార్టం నిర్వహించారు.

ప్రమాదకరంగా యాటకల్లు బ్రిడ్జి



కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న యాటకల్లు బ్రిడ్జి

ఆస్పరి: మండలంలోని యాటకల్లు సమీపంలోని బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి కూలిపోతే మండలంలోని యాటకల్లు, తొగలుగల్లు, కైరుప్పల, కలపరి, దొడగొండ గ్రామాలకు వెళ్లేందుకు వీలులేకుండా పోతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 40 ఏళ్ల క్రితం యాటకల్లు వంకపై బ్రిడ్జి నిర్మించడంతో ఆస్పరి నుంచి చొక్కనహళ్లి, ఐనకల్లు, యాటకల్లు మీదుగా కైరుప్ప, ఎమ్మిగనూరు వెళ్తున్నారు. ఈ గ్రామాల ప్రజలకు ఎమ్మిగనూరు వెళ్లేందుకు ఈ రహదారి ద్వారా దగ్గరవుతుంది. బ్రిడ్జి గోడలకు ఉన్న రాళ్లు పడిపోతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోడరాళ్లు పడిపోతే బ్రిడ్జి మొత్తం కొట్టుకుపోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి కూలిపోక ముందే అధికారులు మరమ్మతు పనులు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు సురక్షితం

మద్దికెర : ప్రభుత్వ వైద్యశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, కాన్పులకు ఈ ఆసుపత్రులే సురక్షితమని వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక వైద్యశాలలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గర్భిణులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవడమే గాకుండా వైద్యుల సలహా మేరకు మందులు తీసుకునేలా గ్రామాల్లో పర్యటించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. బాలింతలు తప్పనిసరిగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని, అలాగే కాన్పులు చేస్తుందని చెప్పారు. కాన్పులపై గర్భిణులకు వివరించాలని కోరారు.

హెబ్బటం పెద్దవంక చెరువుకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

హొళగుంద: హెబ్బటం గ్రామంలోని పెద్దవంక చెరువు గట్టుకు శనివారం అధికారులు మరమ్మతు పనులు ప్రారంభించారు. గట్టుకు సంబంధించి పలు చోట్ల బొంగులు(గుంతలు) పడడం వల్ల చెరువు నిండితే గండి పడే సూచనలున్నట్లు హెబ్బటం రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో శుక్రవారం మైనర్ ఇరిగేషన్ డీఈఈలు చెన్నకేశవనాయక్, షఫి, ఏఈ పణికుమార్ పరిశీలించి శనివారం పనులు ప్రారంభించారు. ఎలాంటి ప్రమాదం వాటిళ్లకుండా అధికారులు అవసరమైన మరమ్మతు పనులు చేయడంపై గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌కు నిప్పు

కృష్ణగిరి: మండలంలోని రామకృష్ణాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురువ సురేష్ బైక్‌కు శనివారం రాత్రి నిప్పు పెట్టారు. వారం క్రితం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సురేష్‌పై దాడికి యత్నించగా వారి నుంచి తప్పించుకునేందుకు బైక్‌ను స్థానిక చర్చి సమీపంలో వదిలి పారిపోయాడు. అప్పటి నుంచి సురేష్ బయట తలదాచుకుంటున్నాడు. చర్చి సమీపంలో ఉన్న పల్సర్ 150సీసీ బైక్‌కు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న బాధితుడు ఫోన్ ద్వారా పోలీసులకు తెలియజేయగా.. వారు కాలిపోయిన బైక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బాధితుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనపై దాడికి ప్రయత్నించిన వారే బైక్‌కు నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు సురేష్ ఆవేదం వ్యక్తం చేశాడు.



కాలిపోయిన బైక్‌ను పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచిన పోలీసులు

తేరుబజారులో పారిశుద్ధ్య పనులు

హొళగుంద: స్థానిక సిద్దేశ్వరస్వామి తేరు బజారులో శనివారం పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ పారిశుద్ధ్య పనులు చేయించారు. తేరుబజారులో చెత్తా చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడేస్తుండడంతో స్థానికులతో పాటు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. పారిశుద్ధ్యం లోపించడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. స్థానికులు తేరుబజారులో చెత్త పడేయకుండా సహకరించాలని కోరారు.



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

దేవనకొండ: పండ్లతోటలు సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించాలని హార్టికల్చర్ ఏపీడీ పక్కీరప్ప అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల వారీగా ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. పండ్ల తోటలు పెంచుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులను గుర్తించాలన్నారు. హార్టికల్చర్ గురించి ప్రతి గ్రామంలో దండోరా వేయించి రైతులకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న హార్టికల్చర్ ఏపీడీ పక్కీరప్ప

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా రెండో అదనపు జడ్జి

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని స్పెషల్ సబ్‌జైల్‌ను శనివారం జిల్లా రెండో అదనపు జడ్జి, సెషన్స్ జడ్జి పీజే సుధ తనిఖీ చేశారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల గదులు, వంటశాల, రేషన్ గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. క్షణికావేశంలో చేసిన నేరాలకు శిక్ష అనుభవిస్తున్నారని, ఎవరూ క్షణికావేశానికి లోనుకాకూడదని సూచించారు. జీవితం ఎంతో విలువైనదని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జడ్జి వెంట జైలు పర్యవేక్షణాధికారి నజీర్‌అహ్మద్, ఉచిత సహాయ న్యాయవాది ఆనంద్, అడ్వకేట్ లోకేష్, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌జైలులోని సరుకులు నిల్వ ఉన్న గోదామును పరిశీలిస్తున్న జడ్జి పీజే సుధ



ఖైదీల గదులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

ములాఖత్ వేళల్లో మార్పులు

– సబ్‌జైలు పర్యవేక్షణాధికారి నజీర్‌అహ్మద్

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని స్పెసల్ సబ్‌జైలులో ఖైదీలు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు కల్పించే ములాఖత్ వేళల్లో మార్పులు చేసినట్లు సబ్‌జైలు పర్యవేక్షణాధికారి నజీర్‌అహ్మద్ తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంగళగిరి జైళ్ల శాఖాధిపతి ఆదేశాల మేరకు ఈనెల 18వ తేదీ నుంచి ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4:30 గంటల వరకు ములాఖత్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సందర్శకులు సమయాన్ని గమనించాలని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పత్తికొండ, ఆలూరు
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com